www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 23 అక్టోబర్ 2024

5

అన్నమయ్య

మృతుల కుటుంబాలకు రూ.20 వేలు ఆర్థిక సాయం

బాధితులకు సాయమందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పీలేరు : కలకడ మండలంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు కుటుంబాలకు రూ.20 వేలు చొప్పున తక్షణ సాయం అందించారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగత కార్యదర్శి సత్య నారాయణ మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో మృతుల బంధువులను కలిసి ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను చూడడానికి మంగళవారం ఉదయం శవాగార వద్దకు చేరుకున్న బంధువులు, ఆత్మీయులు, మిత్రుల రోదనతో ఆసుపత్రి ప్రాంగణం మారుమోగింది. వారి రోదనలు చూపరులను సైతం కంటతడి పెట్టించింది. నియోజకవర్గ ఎమ్మెల్యే మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున తక్షణ ఆర్థికసాయాన్ని పిఏ సత్యనారాయణ, కలికిరి మండల టిడిపి నాయకులు నిజాముద్దీన్ అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు.

చర్చించేనా!

- రబీపై సమగ్ర చర్చ అవసరం
- ప్రశ్నార్థకంగా ఉక్కు పరిశ్రమ పనులు
- 'కొప్పర్తి' ఎంఎస్‌ఎంఇ నిలిచేనా!
- నేడు జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని ప్రధాన సమస్యలపై చర్చించడంపై సందేహం నెలకొంది. బుధవారం జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. రబీ సీజన్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న ఎరువులు, విత్తన సబ్సిడీ కోత, అన్నదాత సుఖీభవ నిధుల జమ వంటి సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవసాయ, పారిశ్రామిక, విద్య, వైద్య రంగాలు ఎదుర్కొంటున్న ప్రతి కూలతలు జిల్లా ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీలో ఐపి సేవలు, వైద్యనిపుణులు, సిబ్బంది నియామకాలపై దృష్టి సారించాలి. అగ్రికల్చర్ యూనివర్సిటీ నిర్మాణ పనులు, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే తరహాలో ఉక్కు పరిశ్రమ పనులు, కొప్పర్తిలో ఎంఎస్‌ఎంఇ టెక్నాలజీ పార్కు తరలింపు చర్చించాల్సి ఉంది. టెక్నాలజీ పార్కుపై అధికార పార్టీని నిలదీయాల్సి ఉంది. అనంతరం పైప్‌లైన్ పనుల పురోగతి ఏదశలో ఉందో ఆరా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటి వరకు అధికార టిడిపి నుంచి పాలకపక్ష తప్పిదాలను నిలదీసే అవకాశాలు సన్నగిల్లిన నేపథ్యంలో సమగ్రచర్చ దేవతావస్త్రంలా మారింది.

రబీ సీజన్‌లో శనగ విత్తన సబ్సిడీ కుదింపు నిలదీయాల్సి ఉంది. ఇన్‌పుట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, ఫీజురీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం పథకాల నిధుల జమ వంటి పలు అంశాలపై సమగ్రంగా చర్చించాల్సి ఉంది. కెసి కెనాల్ శివార వరకు నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించాల్సి ఉంది. కడప కార్పొరేషన్‌లో స్ట్రామ్‌డ్రెయిన్ పనుల్లో అవకతవకలు ఎత్తిచూపాల్సి ఉంది. అన్నమయ్య, గండికోట నిర్వాసితుల మొర, పింఛా, ఎల్ఎస్‌పి గేట్ల మరమ్మతులు, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని లింగాల కుడి కాల్వ లీకేజీ, యురేనియం పైప్‌లైన్ పనుల పురోగతిపై ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉంది. 2021 నవంబర్ వరదల్లో అన్నమయ్య రిజర్వాయర్ మట్టికట్ట తెగిన సందర్భంగా సుమారు ఆరు గ్రామాల ప్రజానీకం నిర్వాసితులుగా మారిన సంగతి తెలిసిందే. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్ నిర్వాసితులను ఆదుకుంటామని హామీ నిచ్చారు. ఇప్పటికీ హామీలో ఆశించిన పురోగతి కొరవడింది. పింఛా, ఎల్ఎస్‌పి గేట్లకు మరమ్మతులు, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్ లీకేజీల పరిష్కారం, యర్రబల్లి-పార్నపల్లి పైప్‌లైన్ పనుల్లో ఆలస్యం కారణంగా యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియడం లేదు. గండికోట నిర్వాసితులకు రూ.ఏడు లక్షల పరిహారానికి అదనంగా మరో రూ.మూడు లక్షలు అందిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనుల్లో పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. ఐదేళ్ల సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం మారి టిడిపి, జనసేన, బిజెపి కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో ఉక్కు పనుల పురోగతిపై సందేహం నెలకొంది. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలులో వైఫల్యం జిల్లా ప్రజలకు శాపంగా మారింది. గతేడాది ప్రారంభంలో జెఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఇప్పటివరకు ఎటువంటి పురోగతి కనిపించలేదు. కొప్పర్తికి రూ.150 కోట్ల నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. ఫలితంగా యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఉపాధి అవకాశాలు కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వలసలు వెళ్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికైనా జిల్లా పరిషత్ పాలకవర్గం జిల్లా సమగ్రాభివృద్ధిపై సమగ్రమైన చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పడంలో సందేహం లేదు.

రెవెన్యూ శాఖ ప్రతిష్ట పెంచాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

పౌరులకు వేగవంతంగా సేవలు అందించి రెవెన్యూ శాఖ ప్రతిష్టను పెంచేందుకు ప్రతి అధికారి, సిబ్బంది చేయూనివ్వాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాయచోటి డివిజన్ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యం. ఏదైనా సమస్య వచ్చినప్పుడు వాటిని క్షుణ్ణంగా చదివి తీసుకోవాల్సిన చర్యపై ప్రణాళిక బద్ధంగా కార్యాచరణను అమలు చేయాలన్నారు. రెవెన్యూ చట్టాలు, విధులను బాధ్యతగా అమలు చేయాలన్నారు. విధుల అమలులో చిత్తశుద్ధి, అంకితభావం ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఆలోచనలు క్షేత్రస్థాయిలో అమలు కావాలన్నారు. అప్పుడే ప్రజలకు రెవెన్యూ శాఖ పైన ప్రభుత్వంపైన ఎంతో నమ్మకం ఏర్పడుతుందని చెప్పారు. పిజి ఆర్ఎస్ దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని తెలిపారు. వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఉద్యోగి పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. అంశాల వారీగా సమీక్షలో భాగంగా సిఎం కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులు వచ్చాయి, పరిష్కరించినవి, ప్రగతిలో ఉన్నవి ఎన్ని, పెండింగ్ కు గల కారణాలపై మండలాల వారీగా తహశీల్దార్లతో సమీక్షించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్యపై ఫిర్యాదు అందగానే అది మన పరిధిలో ఉందా లేదా పై స్థాయిలో ఉందా అని అర్థం చేసుకోవాలన్నారు. సదరు ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలన్నారు. అవసరమైనప్పుడు నోటీసు ఇవ్వాలని, వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవస్థలో లోపాలు సరిదిద్దుకొని ముందుకు వెళ్లగలిగినప్పుడే శాఖకు మంచి పేరు వస్తుంది. ఏ సమస్య పైనైనా కాలాతీతం చేయకుండా వేగంగా నాణ్యతగా పరిష్కరించడమే మన ధ్యేయం కావాలని ఆ దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులలో మొత్తం దరఖాస్తులు ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని, ప్రగతిలో ఉన్నవి ఎన్ని, ఎస్ఎల్ఎ పరిధిలో ఉన్న దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. భూ సమస్యలపై అధికంగా వస్తున్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఎస్ఎల్ఎ పరిధి దాటకుండా వాటిని పరిష్కరించాలని సూచించారు. ఆయా మండలాలలో జరుగుతున్న ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ పరిశీలన ప్రగతిపై కూడా సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ప్రభుత్వ భూములకు తగు రక్షణ కల్పించాలన్నారు. నీటి పన్ను వసూళ్లకు, నీటి వినియోగదారు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పౌర సేవలకు సంబంధించి సిటిజన్ చార్టర్ ప్రకారం కులం, ఆదాయం, నివాస, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు మొదలైన ధృవపత్రాలు నిర్ణీత కాలంలోపు జారీ చేయాలని పౌరులను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుకోరాదని సూచించారు. స్మశాన వాటికలకు సంబంధించి స్థలం నిమిత్తం దరఖాస్తులు వస్తే వాటిని త్వరగా పరిష్కరించాలి. స్థలం అందుబాటులో ఉంటే వెంటనే మంజూరు చేయాలి లేకపోతే అనువైన స్థలాన్ని మరొకచోట పరిశీలించి స్థల కేటాయింపు చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన పరిపాలనా సంస్కరణలను పటిష్టంగా అమలు చేసి వాటి ఫలాలు అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు. అలాగే అజెండాలోని పలు అంశాలలో తహశీల్దార్లు వెలిబుచ్చిన సందేహాలకు తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఒ సత్యనారాయణరావు, ఆర్‌డిఒ రంగస్వామి, ఎస్‌డిసి రామసుబ్బయ్య, జిల్లా సర్వే శాఖ ఎడి భరత్ కుమార్, రాయచోటి డివిజన్ తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, కలెక్టరేట్ ఎఒ నాగభూషణం, సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఐదుకు చేరిన మృతుల సంఖ్య

చికిత్స పొందుతూ మృతి చెందిన దిల్షాద్

ప్రజాశక్తి- కలకడ

అన్నమయ్య జిల్లా కలకడ మండలం స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతూ దిల్షాద్ మంగళవారం మృతి చెందారు. ప్రమాదం జరిగిన రోజే నలుగురు దుర్మరణం చెందిన విషయం విధితమే. సంబేపల్లి మండలం రౌతుకుంట సమీపంలో ఉన్న వంగిమల్లవారిపల్లెలో బంధువుల వ్యక్తి మృతి చెందడంతో అంత్యక్రియలకు కలికిరి మండలం దూదేకులవారిపల్లె నుండి కొంత మంది సోమల మండలం నెల్లిమంద నుండి కొంతమంది ఆటోలో బయలుదేరి కార్యక్రమం ముగించుకుని ఆటోలో వస్తుండగా స్థానిక ఇందిరమ్మ కాలనీ వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటోను ప్రయివేటు బస్సు వేగంగా ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురులో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందిన విషయం విధితమే. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దిల్షాద్ మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆమె మృతితో మృతుల సంఖ్య ఐదుకు చేరింది.

త్వరలో అందుబాటులోకి రైతుబజార్ : ఎమ్మెల్యే

రైతుబజార్‌ను సందర్శిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో ఏర్పాటు చేసిన రైతు బజారు త్వరలోనే పురప్రజలకు అందుబాటులోకి రానుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మంగళవారం మార్కెటింగ్ ఎడి త్యాగరాజు, టమోటా మార్కెట్ యార్డ్ కార్యదర్శి అభిలాష్, మున్సిపల్ కమీషనర్ కె.ప్రమీలతో కలసి రైతుబజార్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. క్షేత్రస్థాయిలో స్టాల్స్‌ను పరిశీలించి సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే తగు సలహాలు సూచనలు చేశారు. స్థానికంగా ఎవరెవరికి స్టాల్స్ కేటాయించాలో వివరాలు తెలుసుకున్నారు. రైతుబజారులో కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం విక్రయించే వ్యాపారస్తులకు స్టాల్స్ కేటాయించాలన్నారు. మున్సిపల్ శాఖకు రూ.50 వేల డిపాజిట్, నెలకు రూ.4 వేలు అద్దె చెల్లించి రూమ్ తీసుకోవాల్సిందిగా ప్రజలు, రైతులు, చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే సూచించారు. మార్కెటింగ్ ఎడి త్యాగరాజు మాట్లాడుతూ కూరగాయలు పండించే రైతులు నేరుగా రైతుబజారులో వారే అమ్ముకొనే విధంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. పోతబోలు గ్రామ పంచాయతీలో పలు పల్లెల్లో రైతులను కలుసుకున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతు బజారులో షాప్‌లు కేటాయిస్తామన్నారు. రైతులు తాము పండించిన పంటలు రైతుబజార్‌కు తెచ్చుకోవడానికి రవాణా సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు టిడిపి నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం, ఎస్.ఎ.మస్తాన్, జి.వి.నాయుడు, బీదం గురునాథ్ యాదవ్, వేణు, పసుపులేటి మెహన్, పసుపులేటి వినోద్ కుమార్, నాగార్జున బాబు, విద్యాసాగర్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

27 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

కబడ్డీ పోటీలకు భూమిపూజ చేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి : పట్టణంలో మొట్టమొదటిగా నిర్వహించే పాఠశాల క్రీడా సమైఖ్య రాష్ట్ర స్థాయి అండర్-17 బాలుర, బాలికల కబడ్డీ పోటీలను విజవంతం చేయాలని మంత్రి సోదరులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి భానుమూర్తి రాజు కోరారు. రాయచోటిలో ఈ నెల 27, 28, 29వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు జిల్లా విద్యా శాఖ అధికారి శివ ప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత కుమారి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘా చీఫ్ ప్యాటరాన్ నరసరాజు ,జిల్లా కబడ్డీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరాంజనేయులు తో కలిసి మంత్రి సోదరులు, రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి ప్రభుత్వ హైస్కూల్ వెనుక ఉన్న మైదానంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడా కారులకు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేస్తున్నమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వ్యాయమ ఉపాధ్యాయ, బోధన ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

ప్రజాశక్తి-మదనపల్లి

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా అన్నారు. మంగళవారం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, నెహ్రూ యువ కేంద్ర గ్రామ శక్తి సొసైటీ వారి ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర దేశాల నుండి కొంతమంది మాదకద్రవ్యాలను దిగుమతి చేసుకొని కళాశాల యువతీ యువకులను లక్ష్యం చేసుకొని వారిని మత్తు పదార్థాలకు బానిసలు చేస్తున్నారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు గురించి ఎటువంటి సమాచారం తెలిసిన తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గ్రామ జ్యోతి సొసైటీ కో-ఆర్డినేటర్ సుభద్ర మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ నిర్మూలించడంలో ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యమని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ డ్రగ్ రహితసమాజం కోసం యువత కృషి చేయాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనవుతూ మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని చెప్పారు. విద్యార్థులు చెడలవాట్లకి దూరంగా ఉండి మంచి ఉన్నత స్థానాలకు చేరుకొని తమ తల్లిదండ్రులని బాగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ ఎన్జీవో పిఎస్ ఆర్గనైజేషన్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ వివిఎన్ భాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై.అరుణ్ కుమార్‌రెడ్డి, అధ్యాపకులు ఈశ్వర్‌రెడ్డి, దర్శన్, గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లి



అన్నమయ్య జిల్లా ఎపివిబిఎస్ మదనపల్లె నియోజకవర్గ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులుగా నియమిస్తూ రాష్ట్ర హైపవర్ కమిటి ఎంపిక చేసిందని పూర్రా ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియమ నిబంధనలకు లోబడి వాల్మీకుల హక్కుల సాధన కోసం పాటు పడతానని,తనను ఎంపిక చేసిన కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. వాల్మీకి బోయల అభివృద్ధికి కట్టుబడి సాంఘిక, ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఎస్టీ హోదా కోసం తీవ్రంగా పోరాడతామని ఈ బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ సమాజ హితాన్ని ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

నిబంధనల మేరకే బాణాసంచా విక్రయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ నిబంధనల మేరకే బాణాసంచా వ్యాపారాలు నిర్వహించు కోవాలని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ అదేశించారు. మంగళవారం మదనపల్లెలోని మిషన్ కాంపౌండ్, బిటికాలేజ్ మైదానాలను అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ పరిశీలించారు. బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకోవడానికి ఇక్కడున్న అనుకూలతలను అధ్యయనం చేశారు. ఇదే తరహాలో కదిరి రోడ్డులోని మసీదు కాంప్లెక్స్ మైదానం టపాసుల విక్రయాలకు అనుకూలంగా ఉందని వ్యాపారులు చెప్పడంతో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మైదానాలను పరిశీలించిన వారిలో అగ్నిమాపక అధికారి శివప్ప, సిఐలు రామచంద్ర, చాంద్‌బాషా, కళా వెంకటరమణ తదితరులు ఉన్నారు.

మిషన్ కాంపౌండ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-పీలేరు

ఆరోగ్యకర సమాజ నిర్మాణం కోసం ప్రజలందరూ ఆరోగ్య నియమాలు విధిగా పాటించాలని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. మంగళవారం పీలేరు మండలం, ముడుపుల వేముల పంచాయతీ, కుమ్మరపల్లిలో ఉచిత వైద్య శిభిరం నిర్వహించి, "అధిక వర్షాలు-ఆరోగ్య నియమాలు" అనే అంశంపై అవగాహన కార్యక్రమాలు చేశారు. పరిశుభ్రమైన నీరు, గాలి, ఆహారం, పరిసరాలు, వ్యాధులులేని సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. లేదంటే నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు, జిగటవిరేచనాలు, పోలియో, మొదలగు అంటువ్యాదులు సోకే ప్రమాదం ఉందని చెప్పారు. నీటిని కాచి, వడగట్టి, చల్లార్చిన నీటిని, లేదా శాస్త్రీయ పద్ధతిలో క్లోరినేషన్ విధానంలో శుద్ధి చేసిన నీటిని తాగాలని పేర్కొన్నారు. శుభ్రమైన ఆహారం భుజించాలని తెలిపారు. ఈగలు వాలిన పదార్థాలు తినకూడదని చెప్పారు. భోజనం చేసే ప్రతిసారీ సబ్బుతో చేతులు రుద్ది శుభ్రం చేసుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 28 మందికి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఎఎన్ఎం వసుంధర, సిహెచ్ఒ నాగముత్యం, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర సాగు పద్ధతులతో అధిక దిగుబడి : ఎడిఎ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమగ్ర సాగు పద్ధతుల ద్వారా అధిక పంట దిగుబడి సాధ్యమౌతుందని ఎడిఎ శివకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పోతపోలు గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట సాగులో చేస్తున్న పొరపాట్లను వివరించారు. ఎఒ నాగప్రసాద్ మాట్లాడుతూ రైతులు విచక్షణ రహితంగా ఎరువులు వాడకుండా, సుస్థిర వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ రంగంలో అపోస్పైరిల్లం, (ట్రైకో డెర్మ, సూడోమోనస్) వంటి బయో ఏజెన్ట్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. మాహా ఉద్యాన శాఖలోని పథకాల గురించి హార్టికల్చర్ అధికారి ఈశ్వర్ ప్రసాద్ తెలియ జేయడంతో పాటు ఉద్యాన పంటల సాగులో మెలకువలను వివరించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతుల తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ డిఇగా అమీర్‌బాషా

ప్రజాశక్తి-పీలేరు

ఎపిఎస్‌పిడిసిఎల్ పీలేరు ట్రాన్స్‌కో ఆపరేషన్ సబ్ డివిజనల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా అమీర్‌బాషా బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు హెచ్‌టి మీటర్ల విభాగంలో ఇంజినీరుగా పనిచేసిన ఆయన ప్రస్తుతం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై పీలేరుకు వచ్చారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసుల పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో స్పందించి వారికి సహకరిస్తామని తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం కూడా తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

దర్గా నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని గాంధీ బజార్‌లో వెలసిన హజ్రత్ రంగిన్ షా వలి దర్గా నూతన కమిటీని మంగళవారం ఆ ప్రాంత వాసులు ఏర్పాటు చేసుకున్నారు. దర్గా కమిటీ అధ్యక్షుడిగా ఎస్.ఏ.కె. హుసేని, కార్యదర్శిగా కె. రహీముద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్.సాధక్ అలీ, ఎస్. హిమాయతుల్లా ఇద్దరిని ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా షేక్ ఎండి అక్బర్, సంయుక్త కార్యదర్శులుగా పాలెం కిషోర్, యం. ఇలియాస్ బేగ్ లతోపాటు అబ్దుల్ రహీం, అలీముద్దీన్, నజీరుల్లా, సయ్యద్ అమీర్ అలీ, ఎండి అఫాన్, తమీం, అక్రమ్ముల్ల, మన్సూర్‌ను ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అతి పురాతన దర్గా హజ్రత్ రంగిన్ షావలి సాహెబ్ అన్నారు. ఇకమీదట దర్గా ఆలనా పాలనతో పాటు దర్గా అభివృద్ధి కోసం పాటుపడతామని చెప్పారు. ప్రతి శుక్రవారం దర్గాకు వచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. రాయచోటి పట్టణ పురప్రజలు దర్గా అభివృద్ధి కోసం కమిటీకి సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

మహిళా చట్టాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రతి మహిళాచట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వన్ స్టాప్ సెంటర్ నిర్వాహకులు టి.ప్రభావతి అన్నారు. స్వచ్ఛతాహే సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణ పరిధిలోని మాధవరం, గొర్ల ముదివేడు గ్రామాలలో ఉన్న మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం శిశు సంక్షేమ శాఖ అనుబంధంగా పనిచేస్తున్న వన్ స్టాప్ సెంటర్‌ను జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఏర్పాటు చేసిందని చెప్పారు. హింసకు గురైన మహిళలు, లైంగిక వేధింపులు, గృహహింస, బాల్యవివాహాలు, వివాహేతర సంబంధాలు, బెదిరింపులు వంటి సమస్యలతో బాధపడుతూ ఉంటే వన్ స్టాప్ సెంటర్‌లో తక్షణ సహాయ సహకారం అందిస్తుందని అన్నారు. సమస్యతో వచ్చిన మహిళలకు తాత్కాలిక వసతి అందించడంతోపాటు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి న్యాయ, వైద్య, పోలీస్ సహకారాలు ఉచితంగా అందిస్తామని అన్నారు. మహిళల కోసం వారంలో 24 గంటలు పనిచేసే హెల్ప్ లైన్ నెంబర్ 181 ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం బాలికలు మహిళల మీద జరుగుతున్న అఘాయిత్యాలు, అక్రమ వేధింపులు, హత్యలు మానభంగాలు అరికట్టడానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని పేర్కొన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది రెడ్డి ప్రసన్న, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ భానుమూర్తిరావు

అభివృద్ధిపై దృష్టి సారించండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వ అధికారులు, సర్పంచ్‌లు సమన్వయంతో మండల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపిడిఒ భానుమూర్తిరావు పేర్కొన్నారు. మంగళ వారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం ఎంపిపి నూర్జహాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గతంలో రెండు సార్లు కోరం లేక వాయిదా పడిన సర్వసభ్య సమావేశం మూడవసారి మంగళవారం సజావుగా నడిచింది. ఈ సందర్భంగా ఆయా శాఖ అధికారులు పాల్గొని తమ శాఖల పరిధిలో జరిగిన కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, పారిశు ధ్యంపై దృష్టి సారించాలని సర్పంచ్‌లకు, ప్రభుత్వ అధికారులకు సూచించారు. అనంతరం మండలంలో జరగబోయే నూతన పనులు ప్రతిపాదనలను సభ్యులకు వినిపించారు. కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక ఆధార్ శిబిరం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహి స్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆధార్ కార్డులోని వివరాలు మార్పులు, చేర్పుల కొరకు ఈనెల 25వ తేదీ వరకు స్థానిక ఎంపిడిఒ జి.పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 40 మంది విద్యార్థులు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోగా, మంగళవారం నిర్వహించిన శిబిరంలో మరో 20 మంది విద్యార్థులు ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవడం జరిగిందన్నారు. 25న నిర్వహించే ఈ ప్రత్యేక క్యాంపును విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్ర మంలో అధ్యాపకులు రాధాకృష్ణ, డిజిటల్ అసిస్టెంట్ ప్రమోద్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌రెడ్డి అహ్మద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని మేడికుర్తి ప్రాథమికవారోగ్యకేంద్రంలో డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు వైద్యాధికారి డాక్టర్ చిన్న రెడ్డప్ప ఆధ్వర్యంలో మండలంలోని పిఎంపి, ఆర్ఎంపిలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ చిన్న రెడ్డప్ప మాట్లాడుతూ ఆర్ఎంపిలు, పిఎంపిలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని తదుపరి మెరుగైన వైద్యం కోసం దగ్గరలోని పిహెచ్‌సి, సిహెచ్‌సిలకు పంపాలని ఆదేశించారు. జ్వర బాధితులను రెండు రోజులకు మించి వైద్యం అందించకుండా స్థానిక హెచ్‌డబ్ల్యూసి సెంటర్ లకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రజారోగ్యంలో భాగంగా ఉన్న క్షయ వ్యాధి అనుమానితులను గుర్తించి స్థానికంగా ఉన్న ప్రభుత్వాసుపత్రికి పంపి ప్రజారోగ్యంలో పాలు పంచుకోవాలని చెప్పారు. క్షయ వ్యాధి లక్షణాలను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలికిరి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్ ముజీబ్‌బాషా, క్షయ వ్యాధి జిల్లా అధికారులు డిపిఎస్ సుబ్బయ్య, పిపిఎం ప్రణీత్, సూపర్‌వైజర్ నాగిరెడ్డి, మురళి, భూపతి,హెల్త్ అసిస్టెంట్ షఫీబుల్లా పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించండి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని పెరుమాళ్ళపల్లి కమ్మపల్లి దళితవాడకు చెందిన దళితులపై అగ్రవర్ణాల వారు దాడి చేసి గాయపరచడం బాధాకరమని సిపిఐ రైల్వేకోడూరు నియోజకవర్గం కార్యదర్శి జ్యోతి చిన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాజంపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న దళితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు దళితులపై దాడులు ఎక్కువవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులకు ఒక ఎకరా భూమి కూడా ఉండకూడదా అన్ని ప్రశ్నించారు. దళితుల భూములను అగ్రవర్ణాల వారు దోచుకోవాలని చూస్తున్నారని వీరికి తోడు రెవిన్యూ యంత్రాంగం సహకరిస్తుందని ఆరోపించారు. దళితులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థిని తల్లిదండ్రులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- పరామర్శించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటర్ చదువుతున్న విద్యార్థిని హాస్టల్‌లో విష ద్రావణం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన సోమవారం రాత్రి రామ సముద్రం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రామసముద్రం కస్తూరిబా గురుకుల విద్యాలయంలో ఇంటర్ చదువుచున్న విద్యార్థిని రాత్రి హాస్టలోనే విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన తోటి విద్యార్థులు వార్డెన్‌కు చెప్పడంతో వెంటనే 108 ద్వారా మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. సమాచారం అందుకున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పరిస్థితిని సమీక్షించి విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. విద్యార్థిని పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో తల్లిదండ్రులు పట్టణంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆస్పత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. తల్లిదండ్రులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కారణం ఏమిటనేది నెమ్మదిగా విద్యార్థిని అడిగి తెలుసు కోవాలని సూచించారు. గురుకుల పాఠశాల అధ్యాపకులు, వార్డన్, సిబ్బంది వల్ల ఏవైనా సమస్యలున్నట్లు తెలిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని తెఇపారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు.

తూకాల్లో తేడా వస్తే శిక్ష తప్పదు

ప్రజాశక్తి- పుల్లంపేట : మండల పరిధిలోని తహశీల్దార్ కార్యాలయంలో మంగళ వారం తూనిక కొలతల అధికారి నాగరాజు ఆధ్వర్యంలో రేషన్ దుకాణాల్లోని యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో తూకాల్లో ఎటువంటి అవకతవకలు వస్తే సహించేది లేదని వారిపై చట్ట ప్రకారం శిక్షలు తప్పు అని హెచ్చరించారు. ప్రతి ఒక్క రేషన్ దుకాణంలో తూకాలు కచ్చితంగా లేనియెడల ఆ దుకాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

రేషన్ దుకాణంలో యంత్రాలను పరిశీలిస్తున్న నాగరాజు

అధ్వానంగా బద్దిపల్లి-బడికాయపల్లి రోడ్డు

- వాహనాల రాకపోకలకు తప్పని తిప్పలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఆర్‌అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలోని బద్దిపల్లి-బడికాయలపల్లి వెళ్లే రోడ్డు ఓబిశెట్టిపల్లి క్రాస్ వరకు అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన తారురోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ద్విచక్ర వాహనదారులు, రాష్ట్ర సరిహద్దు వరకు నడుస్తున్న ఆర్టీసీ బస్సు రాకపోకలు సాగించడానికి ఇబ్బందికరంగా మారినట్లు ప్రజలు తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు ఈ దుస్థితిపై స్పందించి తమ గ్రామాలకు ఉన్న ఒక్క బస్సును కూడా ఆగిపో కుండా చూడాలని కోరుకుం టున్నారు. రోడ్లు ఇంతలా గుంతల పడినప్పటికీ ఆర్‌అండ్‌బి అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలను తమ పిల్లలకి ఇవ్వాలంటే భయమేస్తుందని, రోడ్డు పరిస్థితి చాలా అధ్వానంగా ఉండ డంతో కనీసం ద్విచక్ర వాహనాలు వచ్చే తమ పిల్లలు ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురి కాకుండా, సురక్షితంగా వచ్చేం దుకు వీలుగా కనీసం మరమ్మతులను చేయించాలని పలువురు ప్రజలు కోరుకుంటున్నారు. ఈ మార్గం గుండా అధికారులు వచ్చి పరిశీలిస్తే పరిస్థితి అర్థమ వుతుందన్నారు. వర్షాకాలం వచ్చిందంటే రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకంగా మారుతుందని, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని బద్దిపల్లి, బడికాయలపల్లి రోడ్డును పూర్తిస్థాయిలో వేసి వాహన

దెబ్బతిన్న బద్దిపల్లి-బడికాయలపల్లి రోడ్డు

దారులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుకుంటున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ శంకరయ్య మాట్లాడుతూ ప్రజా కార్యక్రమాలకు వెళ్లేటప్పుడు బడికాయలపల్లి మార్గం పూర్తిగా దెబ్బతిన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బి అధికా రులతో మాట్లాడి గుంతలు లేకుండా మరమ్మతులు చేపించేందుకు కృషి చేస్తా నని తెలిపారు. మండల సర్వసభ సమావేశాలు జరగని కారణంతో ఈ విష యాలపై చర్చించడం ఆలస్యమవుతుందని,అలా కాకుండా ఆర్‌అండ్‌బి అధికా రులతో ఈ విషయం తెలియపరిచి సమస్యని అతి త్వరగా పరిష్కరిస్తానని ఎంపిడిఒ శంకరయ్య హామీ ఇచ్చారు. మండల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం నిర్వహిస్తే రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గి అధిక దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారి జి సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం మండలం లోని కెసి అగ్రహారం, బయనపల్లె గ్రామాలలో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంటకు తప్పనిసరిగా సూక్ష్మ పోషకాలను అందజేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని అన్నారు. ఉద్యాన శాఖ అధికారి ఎం.భాస్కర్ మాట్లాడుతూ అరటి, బొప్పాయి,మామిడి పంటలలో అధిక దిగుబడులకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కూరగాయలు, పూలు పంటలకు ఉద్యాన శాఖ ద్వారా రాయితీ అందించడం జరుగుతుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటలు సాగు చేయు రైతులకు కేంద్ర ప్రభుత్వం మెయింటెనెన్స్ కింద నాలుగు సంవత్సరాలకు రైతు ఖాతాకు నగదు జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మార్కెటింగ్ సమస్య ఉండదని సాగుచేసిన పంటను కొనుగోలు చేయడానికి ఉద్యాన శాఖ కంపెనీ వారితో ఒప్పందం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. జనరల్ మేనేజర్ కొండారెడ్డి మాట్లాడుతూ తమ కంపెనీ ఆయిల్‌ఫామ్‌ను కొనుగోలు చేయుటకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఆయిల్ ఫామ్ పండించుటలో మెలకువల గురించి వివరించారు. కార్యక్రమంలో విహెచ్ఎలు మార్కెటింగ్ సిబ్బంది, ఎపి సిఎన్ఆర్ సిబ్బంది, ఎహెచ్ఎ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పక్కా గృహాలను వేగవంతంగా పూర్తి చేయండి : ఎఇ

ప్రజాశక్తి-కలికిరి

పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఎఇ చంద్రశేఖర్ రెడ్డి ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ భానుమూర్తిరావు ఆధ్వర్యంలో పక్కా గృహాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో పక్కా గృహాలకు ఎంపికైన 1650 లబ్ధిదారులుకు గాను 997 మాత్రమే పూర్తి అయ్యాయని, మిగిలినవి వివిధ స్థాయిలో ఆగిపోయాయని తెలిపారు. ఆగిపోయిన పక్కా గృహాలను, మరుగుదొడ్లును డిసెంబర్ 31 లోపల పూర్తి చేయాలని ఆదేశించారు. 2014 నుంచి 2018 వ సంవత్సరం వరకు ఎన్‌టిఆర్ పక్కా గృహాలుకు ఎంపికైన లబ్ధిదారులకు అర్ధాంతరంగా బిల్లులు ఆగిపోయిన వారి వివరాలను సర్వే చేయాలని ఆదేశించారు. కార్యక్రమం లో ఇఒపిఆర్‌డి రియాజుద్దీన్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తంబళ్లపల్లి : మండలంలో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తిచేయాలని హౌసింగ్ అధికారులను డిఎల్‌పిఒ నాగరాజు ఆదేశించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమా వేశం నిర్వహిం చారు. సచివాలయాల పరిధిలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు, పూర్తయిన ఇళ్ల అంశాలపై ఆరా తీశారు.

తంబళ్లపల్లి : మాట్లాడుతున్న డిఎల్‌పిఒ నాగరాజు

ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారును చైతన్యపరిచి త్వరగా ఇంటి నిర్మాణపు పనులు త్వరగా పూర్తిచేసే విధంగా చొరవ చూపాలని ఆదేశించారు. జరిగిన పనులకు వెంటనే బిల్లులు పెట్టినప్పుడే లబ్ధిదారులకు నమ్మకం కలిగి పనుల త్వరగా పూర్తి చేయడం చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఉపేందర్ రెడ్డి, ఇఒపిఆర్‌డి దిలీప్‌కుమార్, హౌసింగ్ పిఆర్ఎఇలు సుజాత, హరి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన ఊటుకూరు సర్పంచ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఊటుకూరు సర్పంచ్ పల్లెపాగు ఈశ్వరయ్య, వైసిపి నాయకులు కొమ్మినేని సుబ్బరాయుడుతో పాటు 50 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. మంగళవారం యల్లమ్మ ఆలయం వద్ద గల యల్లటూరు భవన్‌లో జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త యల్లటూరు శ్రీని వాసం రాజు సమక్షంలో జనసేన కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊటుకూరు పంచాయతీని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చి దిద్దేందుకు అన్ని విధాలా కృషి చేస్తానని తెలిపారు. సర్పంచ్‌తో పాటు పంచా యతీ ప్రజల నమ్మకాన్ని వమ్ము కానివ్వకుండా సమస్యలను అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సర్పంచ్ ఈశ్వరయ్య మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు, విధివిధానాలు నచ్చి గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం జనసేన పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోలాటం హరికృష్ణ, కొమ్మినేని శేఖర్, పూల శ్రీనివాసులు, పూల మల్లిఖార్జున, పూల భాస్కర్, జాజల శ్రీనివాసులు, ఉద్దండపు జగదీష్, కట్టా శివ, లక్ష్మణ్, రవి, అనిల్ పాల్గొన్నారు.

సింగిల్ విండో అధ్యక్షుడికి మాతృ వియోగం

ప్రజాశక్తి-రామాపురం

మండంలోని నల్లగుట్టపల్లి మాజీ విఆర్ఒ, అయోధ్యపురం ధర్మారెడ్డి సరస్వతిపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు అయోధ్యపురం పెద్ది ఒడ్డి మాతృమూర్తి సుబ్బలక్ష్మమ్మ(96) మంగళ వారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సుబ్బలక్ష్మమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వయో భారంతో మృతి చెందారు. తన పిల్లలను ఉన్నత స్థితిలో చూడగలిగారు.

పెద్ద కుమారుడు విఆర్ఒగా, రెండో కుమారుడు సింగల్ విండోఅధ్యక్షుడిగా, మను వడు గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. నల్లగుట్టపల్లిలో బుధవారం దహన సంస్కా రాలు చేపట్టనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలికిరి

మండలంలో నేటి నుంచి జరిగే గ్రామసభలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మహేశ్వరి బాయ్ కోరారు. మండలంలో ఇది వరకు జరిగిన 12 రీ సర్వే చేసిన గ్రామాలలో భూసమస్యల పరిష్కారం బుధవారం టి సంద్రవారిపల్లె, 24న మహల్, 25, 26న పారపట్ల, 29న మునోళ్ళపల్లి, 30న చీకటిపల్లి, నవంబర్ 2న కొర్లకుంట, 4న పల్లవోలు, 5న పతేగడ, 6న కలికిరి 7, 8 తేదీలలో గుట్టపాలెం, 12,13తేదీలలో గుండ్లూరు, 14, 15న మేడికుర్తిలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ తమ సమస్యలను అర్జీ రూపంలో తెలపవచ్చని సూచించారు. రెవెన్యూ శాఖ ద్వారా గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సదరం క్యాంపు పునః ప్రారంభం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

స్థానిక వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళ వారం సదరం క్యాంప్ పునః ప్రారంభమైనది. ఎన్నికల సందర్భంగా సదరన్ క్యాంప్ ఆగిపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు క్యాంప్ నిర్వహిం చలేదు. ఇప్పటి ప్రభుత్వం సదరం క్యాంప్ నిర్వహణకు ఆర్థో పెడిక్ వైద్యులు డాక్టర్ జ్ఞానేశ్వర్‌ను నియమించారు. ఆయన మంగళవారం ప్రభుత్వ ఆసు పత్రిలో 20 మందికి వికలత్వ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్ర మం లో మెడికల్ ఆఫీ సర్ వెంకట్రామయ్య, ల్యాబ్ టెక్నీషియన్ బాలాజీ పాల్గొన్నారు.

రామసముద్రం ఉపాధ్యాయుడికి ఆంధ్రరత్న అవార్డు

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని జంగాలపల్లి గ్రామంలో ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యా యుడిగా పనిచేస్తున్న రాఘ వేంద్ర బాబుకు విద్యా, సాహిత్య రంగాలలో విశేష సేవలు అందించి నందుకు అఖిల భారత తెలుగు సాం స్కృతిక సంస్థ 24వ వార్షికోత్సవం సందర్భంగా

అవార్డు అందుకుంటున్న రాఘవేంద్రబాబు

ఆత్మీయ పురస్కారాల ప్రధా నోత్సవం అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఫౌండర్ గంగాళ్ల విజయ్‌కుమార్ చేతులు మీదుగా మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రరత్న అవార్డు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట స్పెషల్ మేజి స్ట్రేట్ పసుపులేటి శంకర్, కర్ణాటక సినిమా యాక్టర్ పంకజా తదితరులు పాల్గొ న్నారు. రామసముద్రం మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయునికి ఆంధ్ర రత్న అవార్డ్ రావడంతో ఎంఇఒ హేమలత, ఈస్ట్ పాఠశాల ఉపాధ్యా యురాలు హేమలత, ఎస్.జి.పల్లి హెచ్ఎం ఆయుబ్ ఖాన్, మురళి హర్షం వ్యక్తం చేశారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-పీలేరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడ్ ఆప్ అండ్ డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ సంయుక్త ఆధ్వ ర్యంలో పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వ హించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి

మంగళవారం ఈ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, యంగ్ ఇండియా, క్రెడిట్ యాక్సెస్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 85 మంది హాజరుకాగా 46 మంది ఎంపికయ్యారు. ఎపి ఎస్ఎస్‌డిసి మేనేజర్ మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో అమలు చేస్తున్న స్కిల్ హబ్ కోర్సుల గురించి వివరించారు. ఇప్పటి వరకు 180 మంది సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, 113 మందికి వివిధ కంపెనీల్లో ఉపాధి కల్పించినట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి అభినం దించారు. కార్యక్రమంలో ప్రిన్సి పల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి దోనప్ప, నైపుణ్యాభివృద్ధి ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేష్, ఎపిఎస్-ఎస్‌డిసి స్కిల్ కో-ఆర్డినేటర్ హరీష్ పాల్గొన్నారు.

14 మందికి ఉద్యోగాలు

తంబళ్లపల్లి : స్థానిక టిఎన్.వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో 14 మంది ఉగ్యోగాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర నైపుణ్యాభి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖల ఆధ్వర్యంలో ఈ జాబ్ జరిగింది. యంగ్ ఇండియా ప్రతినిధి ప్రవల్లిక, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధి సుబ్రహ్మణ్యం జాబ్‌మేళాకు హాజరయ్యారు. 37 మంది అభ్యర్థులకు గాను 14 మందిని వారి సామర్థ్యాన్ని బట్టి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎటిఎస్ఎస్‌డిసి కో-ఆర్డినేటర్ చౌడయ్య,టిఒలు నాగరాజు,అశోక్ పాల్గొన్నారు.

తేక్వాండోలో పతకాలు సాధించిన 'ఆదర్శ' విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మంగళవారం రైల్వే కోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-19 తేక్వాండో పోటీలలో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని పీడీ నీలకం ఠరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ సంవత్సరం ఎంపిసి చదువుతున్న భార్గవి సిల్వర్ మెడల్, పదవ తరగతి చదువుతున్న లహరి సిల్వర్ మెడల్, పదవ తరగతి చదువుతున్న తేజస్విని బ్రౌన్ మెడల్ సాధించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి వివిధ మెడల్స్ సాధించిన విద్యా ర్థులను కళాశాల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, వైస్ ప్రిన్సిపల్ మోహన్ రెడ్డి, మోడల్ స్కూల్ కో-ఆర్డినేటర్ మునిరత్నం, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్ర మంలో ఆర్ఎస్ స్పోర్ట్స్ అధినేత రవిశంకర్‌రాజు, కోచ్ మానస, గణేష్ అభినందించారు.

సత్తా చాటిన జ్ఞానాంబిక విద్యార్థులు

మదనపల్లి : స్థానిక శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కాలేజీలో ఇద్దరు విద్యార్థులు ఎస్వియులో జరిగిన ఇంటర్ కొలిజియేట్ పోటీల్లో పాల్గొనగా బిబిఎ మొదటి సంవత్సరం చదువుతున్న పి.వి ష్ణువర్ధన్ 74కేజీల విభాగంలో రెండవ స్థానం, లీగ్ సిల్వర్ మెడల్, 54 కేజీల విభా గం లో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారని కరెస్పాండెంట్ డాక్టర్ రాట కొం డ గురుప్రసాద్ తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థిని ప్రిన్సిపల్ రమాదేవిలు అభినం దించారు.

హెచ్ఐవిపై అవగాహన అవసరం

ప్రజావక్తి-రామాపురం

మండలంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ సూపర్‌వైజర్ రమణారెడ్డి, లింక్ వర్కర్ సునీల్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండడం వల్ల హెచ్ఐ కి గురి కాకుండా చూసుకోవచ్చని అన్నారు. హెచ్ఐవికి చికిత్స కన్నా నియంత్రణ మంచిదని అన్నారు. అరక్షిత లైంగిక సంపర్కం, కలుషితమైన సూదులు సిరంజిలు వాడకం వల్ల పరీక్షింపబడని రక్తం ద్వారా, హెచ్ఐవి ఉన్న గర్భిణి నుంచి పుట్టిన బిడ్డకు సంక్రమిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులలో హెచ్ఐవి పరీక్షలు ఉచితంగా చేస్తారని చేయించుకున్న వారి వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలిపారు, ఒకవేళ ఉన్నట్లు నిర్ధారణ అయితే ఎఆర్‌టి కేంద్రాలు, లింగ్ ఎఆర్‌టి కేంద్రాల్లో ఉచితంగా అందిస్తారని తెలిపారు. మందు లు వాడుతూ వైద్యుల సలహాలు పాటిస్తే ఎటువంటి ఆరోగ్య పరమైన ఇబ్బందులు లేకుండా జీవితం కొనసాగించవచ్చునని అన్నారు. ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత చూపకూడదని అలా చేస్తే హెచ్ఐవి, ఎయిడ్స్ చట్టం2017 ప్రకారం శిక్షారమైన నేరమని అన్నారు. ఎయిడ్స్ పట్ల ఏలాంటి సందేహాలుచ అనుమానాలు ఉంటే ఉచిత హెల్ప్ లైన్ 1097 ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. నవంబర్12వ తేదీ వరకు 200 గ్రామాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయ నున్నట్లు తెలిపారు. యువత, మహిళలు, పొదుపు సంఘాలు కార్మికులు, గ్రామ ప్రజలను ఈ ఉద్యమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలాదేవి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ చిన్న రెడ్డప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సెలూన్ షాపు ధ్వంసం కేసులో ముగ్గురు అరెస్టు

- డిఎస్‌పి కృష్ణ మోహన్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

స్థానిక పట్టణంలోని మదనపల్లి రోడ్డులో హెయిర్ సెలూన్‌లపై రాళ్లతో దాడి చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ తెలిపారు. మంగళవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పట్టణంలో సెలూన్ షాప్‌లను ధ్వంసం చేసి భీకర వాతావరణం సృష్టించిన రవి కిషోర్, రెడ్డి ప్రసాద్, ప్రసన్న కుమార్ లను మంగళ కాలనీలోని సత్యనారాయణ స్వామి గుడి వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి టొయోటా కంపెనీకి చెందిన ఇతియోస్ కారును స్వాధీనం చేసుకు న్నామని తెలిపారు. నిందితులు పట్టణంలోని శివాలయం చెక్ పోస్ట్ వద్ద సెలూన్ షాపు ఏర్పాటు చేసుకొని నడుపుకుంటూ ఉండేవారని తెలిపారు. మదనపల్లి రోడ్డు లోని వివిధ బ్రాండ్ల పేరుతో ఇతరులు సెలూన్ షాపులు ఏర్పాటు చేసుకు న్నారని తెలిపారు. దీంతో వారి వ్యాపారం దెబ్బతింటుందన్న దురఉద్దేశంతో ఎలాగైనా వారి షాపులు పైన దాడి చేయాలని అనుకున్నారని అన్నారు. వారిని భయభ్రాంతులకు గురి చేసి అక్కడి నుంచి పంపివేయాలని పతకం పన్నారని తెలిపారు. ఇతియోస్ వాహనంపై వెళ్లి వివిధ బ్రాండ్ల పేరుతో ఏర్పాటైన సెలూన్ షాప్‌లపై అక్రమంగా ప్రవేశించి ఆపై రాళ్లతో దాడి చేసి అద్దాలు, ఫర్నిచర్, ఇతర సామగ్రి ధ్వంసం చేశారని అన్నారు. దాడిలో సుమారు రూ.7లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ పి.చంద్రశేఖర్, ఎస్ఐ జె.నరసింహారెడ్డి, కానిస్టేబుల్ జగన్,సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని తిరుమలపల్లి దళితవాడకు చెందిన దళితులపై దాడి చేసిన కాకర్లవారిపల్లి గ్రామానికి చెందిన అగ్రవర్ణాలకు చెందిన ఐదుగురిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ నాయుడు తెలిపారు. వివరాల మేరకు..కాకర్ల వారిపల్లి గ్రామానికి చెందిన కస్తూరి ఉమా, కస్తూరి శివయ్య నాయుడు, కస్తూరి వెంకటేశ్వర నాయు డు, కస్తూరి కోటేశ్వరరావునాయుడులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్‌టిసి ఢీకొనడంతో ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు.. మండలంలోని పూజా రివాం డ్లపల్లికి చెందిన ఇద్దరు రైతులు ఆవుల వెంకటరమణ, దశరథలు ద్విచక్ర వాహ నంలో అంగళ్లుకు వెళ్లినట్లు తెలిపారు. బస్టాండ్ కూడలి వద్ద బి.కొత్తకోట నుంచి మదనపల్లికి వెళ్తున్న ఆర్‌టిసి బస్సు వీరిని ఢీకొనడంతో ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. బాధితులను 108 సిబ్బంది మోహన్, సాజి ద్‌లు మదనపల్లె జిల్లాఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. చికిత్స అందించిన వైద్యులు ఆవుల వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో ప్రమాదంలో మహిళకు..

ఆటో ఢీకొనడంతో మహిళ గాయపడింది. వన్ టౌన్ సిఐ చాంద్‌బాషా కథనం మేరకు.. నీరుగట్టువారిపల్లె వినాయకవీధికి చెందిన సుజాత మంగళవారం వారపుసంతకు వెళ్లినట్లు తెలిపారు. కూర గాయలు కొనుగోలుచేసి, ఇంటికి వెళ్లేం దుకు మల్లికార్జున సర్కిల్ వద్ద నిలబడి ఉండగా ఆటో ఢీకొట్టినట్లుతెలిపారు. తీవ్రంగా గాయపడిన మహిళను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలి పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలుడు అదృశ్యం

ప్రజాశక్తి-సంబేపల్లె (రాయచోటి టౌన్)

స్కూల్ ఐడి కార్డు కావాలని తీసు కోని వెళ్లిన ఓ బాలుడు అదృశ్యం అయ్యాడు. కుటుంబ సభ్యులు బాలుడి కోసం ఎంత వెతికిన ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం సంబేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సంబేపల్లె ఎస్ఐ రమేష్ బాబు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంబెపల్లి మండలం, అడవి కమ్మ పల్లెకు చెందిన రామయ్య కుమారుడు కుంచపు లోకేష్ స్కూల్ ఐడి కావాలని తన తండ్రి వద్ద నుండి రూ.500లుతీసుకోని వెళ్లి కనిపించకుండా పోయాడు. అప్పటినుంచి కుటుంబ సభ్యులు అంతటా వెతికారు. ఎక్కడా కనిపించక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు.బాలుడి ఆచూకీ తెలిస్తే సంబెపల్లె ఎస్ఐ 9121100566కు సమాచారం ఇవ్వాలని కోరారు.

లోకేష్